

వెంటనే జీతాలు చెల్లించాలి

వికారాబాద్, జూలై 9(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2008 ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరత్నం, రాములు కోరారు. బుధవారం డీఈవో రేణుకాదేవికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించినప్పటి నుంచి ఇప్పటి వరకు వారికి ఆరు నెలల జీతం విడుదల చేయలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బసప్ప, ఉపాధ్యాయులు మహబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.



దమ్మాయిగూడలో సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల ర్యాలీ

బంద్ పాక్షికం

భారీ ర్యాలీలతో ఉద్యోగ, కార్మికుల నిరసన



వికారాబాద్ జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాల నిరసన ర్యాలీ

వికారాబాద్/మేడ్చల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం నిర్వహించిన సార్వత్రిక బంద్ వికారాబాద్, మేడ్చల్ జిల్లాలో పాక్షికంగా జరిగింది. వాణిజ్య, వ్యాపార సముదాలను పాక్షికంగా మూసివేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, బీఆర్‌టీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు అంగన్వాడీ ఉద్యోగులు, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన, విద్యుత్, మునిసిపల్, గ్రామ పంచాయతీ, ఆటో కార్మికులు, వీఆర్ఏలు, మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగులు, కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తిరుగుబాటు తప్పదని కార్మిక సంఘాల నేతలు హెచ్చరించారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, నాలుగు కార్మిక లేబర్ కోడ్‌లను కుదించి యాజమాన్యాలకు, బహుళ జాతి సంస్థలకు కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాస్తోందని ధ్వజమెత్తారు. మేడ్చల్ జిల్లాలోని మేడ్చల్, కుషాయిగూడ, నాచారం మల్లాపూర్ ప్రాంతాల్లోని పారిశ్రామిక వాడలలోని కార్మికులు విధులను బహిష్కరించారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల బాధ్యులు మహిపాల్, భూమొళ్ల కృష్ణయ్య, గీత, ఇందూరు పాటి గోపాల్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ తదితరులు పాల్గొన్నారు.

డీజీ నాయక్‌కు ఉత్కృష్ట సేవా పతకం



ఘట్‌కేసర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉత్కృష్ట పోలీసు సేవా పతకానికి ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీ నగర్‌కు చెందిన గుండ్యా నాయక్ (డీజీనాయక్) ఎంపికయ్యారు. విధి నిర్వహణలో 15 ఏళ్లపాటు పోలీస్ ఉద్యోగంలో సేవతో పాటు అంకితభావంతో పని చేస్తూ వృత్తిపరమైన నైపుణ్యంతో అనేక విజయాలు సాధించారు. అందుకు గాను ఆయనకు ఉత్కృష్ట సేవా పతకం-2025 వరించింది. ప్రస్తుతం డీజీ నాయక్ రాచకొండ కమిషనరేట్ ఇబ్రహీంపట్నం థర్డ్ బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ బెటాలియన్‌లో 13 మందికి పోలీసులకు ఉత్కృష్ట సేవా పతకాలు వచ్చాయి. ఉమ్మడి ఏపీలో 2006లో ఏపీ 14వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా చేరిన ఆయన తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత 1016లో మంచిర్యాల 13వ బెటాలియన్‌లో ఒక సంవత్సరం పాటు విధులు నిర్వహించాడు. అంచెలంచెలుగా ఎదిగి 2018లో ఇబ్రహీంపట్నం థర్డ్ బెటాలియన్‌కు బదిలీ తర్వాత హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. అనంతరం కానిస్టేబుళ్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చే విధులు నిర్వహిస్తున్నాడు. ఉత్కృష్ట పోలీసు సేవా పతకంకు ఎంపికైనా డీజీ నాయక్‌ను నాయకులు, ప్రజలు అభినందించారు.



వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని..

ప్రియుడితో కలిసి తండ్రిని హతమార్చిన కూతురు 8

మూడు నెలలకు సంబంధించి ప్రభుత్వం ఒకేసారి పంపిణీ చేసిన సన్న బియ్యాన్ని జిల్లాలో 87 శాతం(2,18,454 మంది) మాత్రమే రేషన్‌కార్డు లబ్ధిదారులు తీసుకున్నారు. కాగా, 32,642 మంది కార్డుదారులు బియ్యం తీసుకోలేదు. వారిలో కొందరు రేషన్ కోసం కాకుండా కేవలం కార్డు ఉండాలని తీసుకున్న వారు ఉన్నట్లు తెలుస్తోంది. గత నెల జూన్ 30తో బియ్యం పంపిణీ గడువు ముగిసింది. మూడు నెలల బియ్యం కోటా జూన్ నెలలోనే పంపిణీ చేయడంతో జూలై నుంచి రేషన్ దుకాణాలు మూతపడ్డాయి.

- జిల్లాలో మొత్తం రేషన్ కార్డులు 2,51,097
- బియ్యం తీసుకుంది 2,18,454 మంది
- తీసుకోని వారు 32,642 మంది కార్డుదారులు
- దుకాణాల్లో 2,098 మెట్రిక్ టన్నుల నిల్వలు
- జూన్ 30తో మూన్నెళ్ల కోటా పంపిణీ పూర్తి
- జిల్లాలో మూతబడిన రేషన్ దుకాణాలు



సన్న బియ్యమైనా.. ససేమిరా!

కార్డు ఉన్నా బియ్యం తీసుకోని లబ్ధిదారులు



వికారాబాద్, జూలై 9(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో 2,51,097 రేషన్‌కార్డులు ఉండగా, వాటిలో 2,18,454 కార్డుదారులు మాత్రమే ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యం తీసుకున్నారు. ఈసారి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ ముందస్తు సూచనలతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు రాకుండా జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యం కోటా ఒకేసారి పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌దారులకు జూన్ నెలలో ఒకేసారి మూడు నెలల బియ్యం కోటాను పంపిణీ చేశారు.

588 రేషన్ దుకాణాలు

జిల్లాలో 588 రేషన్ దుకాణాలు ఉన్నాయి. మొత్తం కార్డులు 2,51,097 ఉండగా, వాటిలో ఆహార భద్రతా కార్డులు 2,24,438, అన్నపూర్ణ కార్డులు 26,623, అంత్యోదయ కార్డులు 36 ఉన్నాయి. ఈ కార్డుల్లో 8,97,270 మంది సభ్యులు ఉన్నారు. లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు జూన్‌లో 5,381.478 మెట్రిక్ టన్నుల బియ్యం కోటా నిర్ణయించారు. అయితే మూడు నెలలకు సంబంధించి కోటా 16,144.434 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం రేషన్ దుకాణాలకు కేటాయించారు. 13శాతం మంది బియ్యం

మిగతా 8వ పేజీలో...

ప్రతీ నెల వేల సంఖ్యలో..

కొత్తగా వివాహం చేసుకున్న వారు, పిల్లలు కలిగిన వారు తమ కుటుంబ సభ్యుల వివరాలను ఒకవైపు రేషన్ కార్డులో చేర్పించేందుకు దరఖాస్తు చేసుకుంటూ ఉంటే.. మరోవైపు కార్డులు ఉన్న వారిలో కొందరు బియ్యం తీసుకోవడం లేదు. ప్రతీనెలా వేలాది మంది కార్డుదారులు బియ్యం తీసుకోవడం లేదనేది గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నెలలో మొత్తం రేషన్ కార్డుదారుల్లో 81 శాతం బియ్యం తీసుకోగా, ఫిబ్రవరిలో 80 శాతం, మార్చిలో 74 శాతం మాత్రమే తీసుకున్నారు. సన్నబియ్యం పంపిణీ ప్రారంభించిన ఏప్రిల్ నెలలో 81 శాతం తీసుకోగా, మే నెలలో 86 శాతం కార్డుదారులు తీసుకున్నారు. ప్రతినెలా వేల సంఖ్యలో కార్డుదారులు బియ్యం తీసుకోకపోవడంతో అసలు వారు ఉన్నారా? లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారా? లేక రేషన్ బియ్యం వద్దనుకుంటున్నారా? మృతి చెందిన వారి కార్డులు తొలగించకుండా ఉన్నాయా? తదితర ప్రశ్నలు తలెత్తుతున్నాయి.


అక్నాపూర్‌లో ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్/నవాబుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ప్రభుత్వ కళాశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలు, కాలేజీల ప్రిన్సిపాల్స్‌తో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు తాగునీరు, టాయిలెట్స్, లైట్లు, ఫ్యాన్లు, పెయింటింగ్ వంటి సదుపాయాలు తప్పని సరిగా ఉండేలా చూడాలని ఆదేశించారు. తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, చిన్నపాటి మరమ్మతులు తప్పనిసరిగా చేయించాలని సూచించారు. పనుల ప్రారంభానికి ముందు, పూర్తి అయిన తరువాత తీయాల్సిన ఫొటోలు తప్పని సరిగా పంపించాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి, డీఐవో శంకర్ నాయక్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం సందర్శన

వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ బుధవారం సందర్శించారు. అలాగే అక్కడ ఏర్పాటు చేసిన ఈవీఎం గోడౌన్ ను పరిశీలించి సీసీటీవీల ద్వారా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రి భద్రతను తనిఖీ చేశారు. ఆయనతో పాటు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నేమత్ హాలి, తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. బుధవారం నవాబుపేట మండలంలోని చించల్‌పేట్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాటిన ప్రతీ మొక్క బతికేలా అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కలెక్టర్‌తో కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం అక్నాపూర్, అత్తాపూర్ గ్రామాల్లో పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బుచ్చయ్య, ఎంపీడీవో అనురాధ, ఎంఈవో అబ్దుల్ రహెమాన్, రాంరెడ్డి, నాయకులు ప్రభాకర్, గీతా రాథోడ్‌సింగ్, హెచ్ఎం ఎల్.పాండు తదితరులు పాల్గొన్నారు.



పెరిగిన సీనరేజీ ఫీజులు

» నాపరాయి, సుద్ద, ఎర్రమట్టికి మినహాయింపు

కంకరపై 20శాతం పెంపు

» ఉత్తర్వులు జారీ.. తక్షణమే అమలు

తాండూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): మైన్స్ శాఖ సీనరేజీ ఫీజులను సవరించింది. పరిశ్రమలు, వాణిజ్య విభాగం శాఖ ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. సవరించిన ఫీజులు తక్షణమే అమలులోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రతీ మూడేళ్లకు ఒకసారి మైన్స్ శాఖ ఆధ్వర్యంలోని కమిటీ సీనరేజీ ఫీజుల పెంపుపై నిర్ణయం తీసుకొని ప్రభుత్వానికి నివేదిస్తుంది. కాగా, ఈ సారి పెంచిన ఫీజుల్లో కొన్నింటికి మినహాయింపు ఇచ్చింది. తాండూరు ప్రాంతంలో గనులు, ఇసుక, మట్టి, సుద్ద తదితర నిక్షేపాలు ఉన్నాయి. దీంతో ఇక్కడ సీనరేజీ ఫీజు తప్పనిసరి చెల్లించాల్సిందే. తెలంగాణ మైనర్ మినరల్ కన్‌సెషన్ నియమాలు-1966 ప్రకారం.. సీనరేజీ ఫీజును సవరించారు. ఈ ఏడాది మార్చి 31తో గడువు ముగిసింది. ప్రస్తుతం మూడు నెలలు ఆలస్యంగా

మిగతా 8వ పేజీలో...

తక్షణమే అమల్లోకి..



మూడేళ్లకోకసారి ప్రభుత్వం నియమించిన కమిటీ ఖనిజ సంపదపై సీనరేజీ ఫీజుల పెంపుపై నిర్ణయం తీసుకుంటుంది. తాండూరులో దొరికే నాపరాయి, సుద్ద, ఎర్రమట్టిపై భారం పడకుండా కేవలం ఇసుక, కంకరపైనే సీనరేజీ పెరిగింది. పెంచిన సీనరేజీ ధరలు తక్షణమే అమల్లో వచ్చాయి. రూ.65 నుంచి రూ.78కి పెంచారు.

-సత్యనారాయణ, మైన్స్ ఏడీ

నాణ్యమైన విత్తనాలు, ఎరువులనే విక్రయించాలి

» జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి

దుద్యాల, జూలై9(ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలనే విక్రయించాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి మోహన్ రెడ్డి సూచించారు. బుధవారం దుద్యాల మండల కేంద్రంతో పాటు పోలేపల్లిలో పలు ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో రికార్డులు, స్టాక్ వివరాలను పరిశీలించారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన సమయంలో రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట ఏవో నాగరాజు, ఏఈవోలు మాణికేశ్వరీ, భావన తదితరులు పాల్గొన్నారు.


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న డీఏవో మోహన్‌రెడ్డి

పేరుకే ప్రణాళిక!

నత్తనడకన వంద రోజుల ప్రణాళిక

- బల్దియాల్లో అధ్వానంగా పారిశుధ్యం
- రోడ్లపైనే దర్శనమిస్తున్న చెత్తకుప్పలు
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- వర్షాకాలంలో కానరాని ముందస్తు చర్యలు
- ఆందోళనలో మున్సిపాలిటీల ప్రజలు
- జిల్లాలో 1,746 మంది పారిశుధ్య కార్మికులు


ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని మర్పల్లిగూడలో అధ్వానంగా మురికి కాల్వ

మేడ్చల్, జూలై9(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ జిల్లాలోని గ్రామాలన్నీ మున్సిపాలిటీలయ్యాయి. పట్టణాల్లో పారిశుధ్యం, పరిశుభ్రతలకు ప్రాధాన్యమిస్తూ జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున మున్సిపాలిటీల్లో వందరోజుల ప్రణాళికను ప్రారంభించారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రభుత్వం ఈ ప్రత్యేక ప్రణాళికను తీసుకొచ్చింది. అయితే అధికారుల నిర్లక్ష్యంతో ఈ ప్రణాళిక పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. అసలు మున్సిపాలిటీల్లో ఈ కార్యక్రమం కొనసాగుతున్నదా? అనే అనుమానం కలుగుతోంది.

ప్రణాళికలో చేపట్టాల్సిన కార్యక్రమాలు

ఈ ప్రణాళిక ప్రకారం.. వర్షాకాలంలో దోమలు వ్యాప్తి చెందకుండా మురుగు, వర్షం నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలి. లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి. ఇంటి పన్నుల వసూళ్లు, సాంస్కృతిక బృందాలతో ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ప్రచారం చేయించడం, భువన్ సర్వే, తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించడం

మిగతా 8వ పేజీలో...

పారిశుధ్య కార్మికులే కీలకం

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన వంద రోజుల ప్రణాళికలో పారిశుధ్య కార్మికులదే కీలక పాత్ర. ప్రణాళికలో వారు చేయాల్సిన పనులే ఎక్కువ. జిల్లాలో కొత్తగా మూడు మున్సిపాల్టీలు ఏర్పడ్డాయి. అంతకు ముందు ఉన్న 13 మున్సిపాల్టీల్లో 1,746 మంది పారిశుధ్య కార్మికులు ఉండేవారు. మురుగు కాల్వలు శుభ్రం చేయడం, చెత్త సేకరించడం, వన మహోత్సవాన్ని విజయవంతం చేయడంలో పారిశుధ్య కార్మికులే ఎక్కువ మంది పనిచేసేవారు. ఇదిలా ఉంటే జిల్లాలో పట్టణ జనాభాకు అనుగుణంగా కార్మికులు లేక పట్టణ ప్రాంతాల్లో సమస్యలు అధికమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కార్మికులకు కూడా పనిభారం ఎక్కువగానే ఉంది.

కొమిరె రాంచంద్రయ్యకు డాక్టరేట్



పట్టా అందుకుంటున్న రాంచంద్రయ్య

పరిగి, జూలై 9(ఆంధ్రజ్యోతి): పరిగి మండలం బసిరెడ్డిపల్లి వాసికి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొమిరె రాంచంద్రయ్యయాదవ్ ఓయూలో ఆర్థికశాస్త్ర విభాగానికి చెందిన పరిశోధన విద్యార్థి. 'స్టాక్ మార్కెట్ ప్రవర్తన - భారత దేశ ఆర్థిక వృద్ధి' అనే అంశంపై ప్రొఫెసర్ నకులరెడ్డి పర్యవేక్షణలో పరిశోధనలు చేశారు. భారతస్టాక్ మార్కెట్ మార్గదర్శకాలు, పెట్టుబడులు, ఆర్థిక వృద్ధిపై చేసిన పరిశోధన పత్రాలను యూనివర్సిటీకి అందజేశారు. ఈ మేరకు బుధవారం ఆర్ట్స్ కళాశాలలో ప్రొఫెసర్ నకులారెడ్డి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

ఓటరు జాబితాలో తప్పులుండొద్దు

శంకర్‌పల్లి, జులై 9(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా తయారీలో బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని, జాబితాను తప్పుల్లేకుండా జాగ్రత్త పడాలని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ సూచించారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బూత్‌లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లకు జాబితా తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎలక్ట్రోరల్ ప్యూరిఫికేషన్, ఓటరు జాబితా తయారీ, సవరణ, ఫామ్-6, 7, 8లపై మాస్టర్ ట్రైనర్స్ ఆశీర్వాదం, బాలాజీ, రోషన్‌లు అవగాహన కల్పించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ ఓటరు జాబితాలో కొత్త వారిని చేర్చడం, చనిపోయిన వారి పేర్లను తొలగించాలన్నారు. నియోజకవర్గ ట్రైనింగ్ ఇన్ చార్జి నర్సింహరావు, శంకర్‌పల్లి, చేవెళ్ల తహసీల్దార్లు సురేందర్, కృష్ణయ్య, శంకర్‌పల్లి డీటీ బాలకృష్ణారెడ్డి, ఎన్నికల సూపర్‌వైజర్ పాండు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రకళ



సమావేశంలో మాట్లాడుతున్న కాళ్ల జంగయ్య

దివ్యాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంచాలి

- వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య

ఆమనగల్లు, జూలై 9(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ. 6 వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు ఆసరా పింఛన్ పెంచాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో విఫలమైందన్నారు. ఆమనగల్లులోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్, ఎమ్మెఎస్పీ జిల్లా స్థాయి సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ దివ్యాంగులకు, వృద్ధుల సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. ఈనెల 21న దివ్యాంగుల, ఆసరా పింఛన్‌దారుల జిల్లా మహాసభను నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ్మా, ఉపాధ్యక్షుడు తుడుం కిరణ్ మాదిగ, జంగయ్య, రావుగల్ల బాబు మాదిగ, మైసయ్య, ఉపాధ్యక్షులు రాములు, నర్సింహ్మా, రామచంద్రయ్య, కిరణ్‌పూలే, మండల అధ్యక్షులు శ్రీశైలం, శ్రీనివాస్, రమేశ్, నాయకులు భాస్కర్, సత్యనారాయణ గౌడ్, సాయిలు, డేరంగుల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల బాధలు పట్టని ప్రభుత్వం

● మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

ఆమనగల్లు, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ ఆరోపించారు. రైతుల సమస్యలు పట్టించుకోకుండ మొద్దు నిద్ర పోతోందని మండిపడ్డారు. ఆమనగల్లు, వెల్దండ, మాడ్గుల మండలాలకు సాగునీటినందించే కేఎల్ఐ డీ-82 కాల్వను బుధవారం జూపల్లి వద్ద రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి జైపాల్‌యాదవ్ పరిశీలించారు. కాల్వవెంట నడుచుకుంటూ రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తిచేసి చివరి ఆయకట్టు మాడ్గుల మండలం నాగిళ్ల వరకు నిర్ణీత 35వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించాలని డిమాండ్ చేశారు. రవీందర్, విజయ్‌గౌడ్, వెంకటయ్యగౌడ్, జగపతి, తిరుపతయ్య, శ్రీరాములు, వెంకట్, రియాజ్, భిక్షపతి, ప్రశాంత్, రామస్వామి పాల్గొన్నారు.



కేఎల్ఐ డీ-82 కాల్వను పరిశీలిస్తున్న జైపాల్ యాదవ్

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

మహేశ్వరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంలో ఐఎన్‌టీయూసీ పాత్ర కీలకంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన రెడ్డిగళ్ల అజయ్‌కి నియామక పత్రాన్ని బుధవారం తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో అనేక రకాల పరిశ్రమలున్నాయని, కార్మికులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా ముందుగా ఐఎన్‌టీయూసీ నాయకులే ముందుండాలన్నారు. దేప భాస్కర్‌రెడ్డి, కప్పాటి పాండురంగారెడ్డి, ఎ.ప్రశాంత్ రెడ్డి, శివ పాల్గొన్నారు.



అజయ్‌కి నియామకపత్రం అందిస్తున్న కేఎల్లార్



కొండా సురేఖకు ఆహ్వానపత్రిక అందిస్తున్న అర్చక సంఘం నాయకులు

మంత్రి కొండా సురేఖను కలిసిన అర్చకులు

కొడంగల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో ఈనెల 14, 15వ తేదీల్లో జరిగే పంచకుండాత్మక చండీకుబేర పాశుపతయాగానికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఆహ్వానించారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రిక అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర సలహాదారు లక్ష్మీనర్సయ్యశర్మ, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థచారి, జోషి కిట్టుస్వామి, దత్తాత్రేయ రావు, తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

మహేందర్‌రెడ్డి మృతి బీజేపీకి తీరని లోటు

కోట్‌పల్లి, జులై 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకుడు పట్లోళ్ల మహేందర్ రెడ్డి జూన్ 28వ తేదీన విద్యుత్ షాక్‌తో మృతి చెందడం బాధాకరమని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బార్వాద్ గ్రామంలో ఆయన సంస్మరణ సభకు హాజరై కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు శివరాజ్, సాదానంద్‌రెడ్డి, రమేష్ కుమార్, వడ్ల నందు, మాధవ రెడ్డి, మండల అధ్యక్షుడు శివకుమార్, రాంచంద్రరెడ్డి, వెంకటేష్‌యాదవ్, నరేందర్ రెడ్డి, కృష్ణయాదవ్, రాఘవేందర్‌గౌడ్ ఉన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో వన మహోత్సవం



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, తదితరులు

శామీర్‌పేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు వన మహోత్సవం దోహదం చేస్తుందని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల(జగద్గిరిగుట్ట) ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఇశ్రత్ అన్నారు. బుధవారం వన మహోత్సవంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ చేతన, అకాడమిక్ వైస్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు. శామీర్‌పేటలో మున్సిపల్ సిబ్బందితో కలిసి అఫ్జల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అఫ్జల్‌ఖాన్ మొక్కలు నాటారు.



ధర్నాకు దిగిన గ్రామస్తులు, బంధువులు

రవికాంత్ కుటుంబానికి న్యాయం చేయాలి

మాడ్గుల, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొనడంతో మంగళవారం మృతి చెందిన దుబ్బ రవికాంత్ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. బుధవారం రోడ్డుపై బైఠాయించి బంధువులు ధర్నాకు దిగారు. ఇబ్రహీంపట్నం డిపోకు చెందిన బస్సులను మాడ్గులలో నిలిపివేశారు. డీఎం వచ్చి మృతుడి కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కోరారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని సీఐ వేణుగోపాల్‌కు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకుడు తల్లోజు ఆచారి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భట్టు కిషన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు సూదిని కొండల్‌రెడ్డిలు రవికాంత్ మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు.

రూ.14 కోట్లతో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్

మేడ్చల్ టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మార్కెట్ కమిటీ పరిధిలో రూ.14కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యదవ్ అన్నారు. బుధవారం మార్కెట్ కమిటీ పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్ అభివృద్ధికి ఈ నిధులు ఖర్చు చేస్తామని తెలిపారు. ఐదు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిలువ చేసే గిడ్డంగుల నిర్మాణంతోపాటు సీసీ రోడ్లు, స్వాగత తోరణం, మార్కెట్ కమిటీ కార్యాలయ నిర్వాహణకు ఖర్చు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, డైరెక్టర్లు రాజు, శంకర్ పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర



గురుపౌర్ణమిని పురస్కరించుకొని తాండూరు - కోకట్ రోడ్డు మార్గంలోని షిర్డి సాయిబాబా ఆలయ భజన మండలి ఆధ్వర్యంలో బుధవారం సాయిబాబా ఫొటోతో శోభాయాత్ర నిర్వహించారు. గురు పౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

- తాండూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి)

నాగసమందర్‌లో బోనాల సందడి

మండల పరిధిలోని నాగసమందర్ గ్రామంలో మంగళవారం గ్రామ దేవత పోచమ్మకు ఆషాఢ బోనాలను ఘనంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు బోనాలతో అమ్మవారి ఆలయం వద్దకు ఊరేగింపుగా వెళ్లారు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించి చల్లంగా చూడాలని వేడుకున్నారు.

ధారూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి)



కబ్జా వాస్తవమే..

- జుంటువాగు కబ్జాపై కలెక్టర్ సీరియస్
- రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సర్వే
- అక్రమ భవనం కూల్చివేతకు ఆదేశాలు



జుంటువాగు ప్రాంతంలో మ్యాప్ ద్వారా కబ్జాను గుర్తిస్తున్న అధికారులు

బషీరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బషీరాబాద్- తాండూరు మార్గంలోని జుంటువాగు కబ్జాపై కలెక్టర్ ప్రతీక్‌జైన్, తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సీరియస్‌గా స్పందించారు. కలెక్టర్ ఆదేశానుసారం యాలాల తహసీల్దార్ వెంకటస్వామి, తాండూరు డివిజన్ ఇరిగేషన్ డీఈఈ కిష్టయ్య, ఏఈ భానుప్రకాష్‌రెడ్డి, ఆర్ఐ శివ చరణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్, సిబ్బంది తదితరులు బుధవారం వాగు ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడున్న వ్యక్తి గోపాల్‌తో డ్యాకుమెంట్లను తెప్పించుకుని పరిశీలించారు. వాగుకు ఆనుకొని ఐదు మీటర్ల మేర 200 మీటర్ల పొడవునా మట్టి పోసి కబ్జాకు పాల్పడినట్లు తేల్చారు. చెక్‌డ్యాం వాగు వింగ్‌వాల్ సమీపం నుంచి కొలతలు తీయగా బఫర్‌జోన్ పరిధిలోకి వచ్చే ప్రభుత్వ స్థలంలో అక్రమంగా రెండు గదులు నిర్మిస్తున్నట్లు బయట పడింది. అక్కడున్న వ్యక్తిని ఆరా తీయగా పదేళ్ల కిందట సర్వే 52, 53, 58లో 17.13 ఎకరాలు కొనుగోలు చేశామని, సర్వే చేశాకే గదులు నిర్మిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. వెంటనే అక్రమ నిర్మాణం కూల్చి వేయాలని తహసీల్దార్ ఆదేశించారు. అక్రమంగా నిర్మిస్తున్న గదులు సర్వే నంబరు 39:2లోని ప్రభుత్వ భూమి తాండూరు మండల పరిధిలోకి వస్తుండటంతో అక్కడి తహసీల్దార్ తారాసింగ్‌కు యాలాల తహసీల్దార్ వివరించారు. అనంతరం వాగు పక్కగుండా కబ్జా చేసిన ప్రాంతాన్ని అధికారులు సిబ్బందితో దగ్గరుండి సర్వే చేయించి హద్దులు గుర్తించారు. హద్దులు తొలగించినా, రెండు రోజుల్లో అక్రమ నిర్మాణం కూల్చి వేయకున్నా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు.

పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి

- పరిశ్రమల హబ్‌గా చందన్‌వెల్లి
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



సోలార్ ప్యానల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

షాబాద్, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతన పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చందన్‌వెళ్లి పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసిన జున్నా సోలార్ సిస్టమ్స్ లిమిటెడ్ మ్యానుఫాక్లరింగ్ యూనిట్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. వారు మాట్లాడుతూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కంపెనీ యజమానులు శేఖర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, బస్విరెడ్డి, ప్రసాద్‌రెడ్డిలు మాట్లాడారు. సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ సురేందర్ రెడ్డి, గుడిమల్కాపూర్ ఏఎంసీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్, ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, జనార్దన్‌రెడ్డి, ఖాజామియా, శ్రీనివాస్‌గౌడ్, లింగం, పాండురంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, జూలై9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం బొంరాస్‌పేట్ మండలంలోని ఎన్కెపల్లి గ్రామంలో విద్యార్థి తల్లిదండ్రుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దాతల సహకారంతో పలకలు, ఐడీకార్డులు, టై, బెల్టులు, బూట్లు, బ్యాగులు, పాఠశాలకు సీసీ కెమెరాలు, పరేడ్ డ్రమ్స్‌ను అందించారు. వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్‌యాదవ్, ఎంఈవోలు హరిలాల్, రామ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, నర్సిములుగౌడ్, వెంకట్రాములుగౌడ్, వక్త భాస్కరయోగి, సీఐ శ్రీధర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, గౌరారం గోపాల్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యస్థాపనే లక్ష్యం

ఘట్‌కేసర్ రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యస్థాపనే ప్రభుత్వ లక్ష్యమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని మర్రిపల్లిగూడ, మాధారం, అంకుశాపూర్, అవుశాపూర్‌లలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని, బీ బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్, నాయకులు కవాడి మాదవరెడ్డి, కందకట్ల సందీప్‌రెడ్డి, మేడబోయి జంగయ్య, కవాడి వామన్‌రెడ్డి, ముత్యాల్ యాదవ్, ముల్లి జంగయ్య, సత్తిరెడ్డి, చిన్నాయాదవ్ పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్

మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు



మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో సీతక్కను ఆమె కార్యాలయంలో కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికి సహకారం కొనసాగాలని మంత్రిని ఎమ్మెల్యే కోరినట్లు తెలిపారు.ఎమ్మెల్యే వెంట రఘునాయక్, ఎస్డీ ఇబ్రహింలు ఉన్నారు.

ఓటర్ల వివరాలను పరిశీలించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల వివరాలను పరిశీలించాలని అదనపు కలెక్టర్ సుధీర్ పేర్కొన్నారు. బుధవారం వికారాబాద్ మునిసిపల్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులకు జాతీయ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డిస్ట్రిక్ట్ లెవెల్ మాస్టర్ ట్రైనర్, అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

పరిహారం తేల్చాకే ఇళ్లు కూల్చండి

తాండూరు రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు పనులకు సంబంధించి తమకు ఇళ్ల కూల్చివేతకు నష్ట పరిహారం తేల్చిన తర్వాతనే ఇళ్లను కూల్చాలని తాండూరు మండలం కోటబాస్పల్లి గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ గ్రామం మీదుగా చేపడుతున్న 167 జాతీయ రోడ్డు పనుల్లో పలువురి ఇళ్లు పూర్తిగా, పాక్షికంగా కూల్చివేసే పరిస్థితులు ఉన్నాయని వాపోయారు. కూల్చివేస్తున్న ఇళ్లకు నష్ట పరిహారం నిర్ణయించి ప్రకటించాలన్నారు.గురుచరణ్‌రెడ్డి, చంద్రారెడ్డి, మొగులప్ప, శేఖర్‌గౌడ్, నాగార్జున, భాస్కర్, కుర్వ మల్కప్ప, వడ్డె బాల్‌రాజ్, అశోక్‌గౌడ్, నిజాశ్రీహరి, కుర్వ భీమమ్మ, కళావతి పాల్గొన్నారు.

భద్రాచలం ఈవోపై దాడి సరికాదు

కీసర, జూలై 9(ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఈవోపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కీసరగుట్ట ఆలయ సిబ్బంది బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాల మేరకు దేవుడి మాన్యం స్వాధీనం చేసుకునేందుకు వెళ్లిన ఆలయ ఈవో రమాదేవిపై మంగళవారం భూకబ్జాదారులు చేసిన దాడిని ఆలయ సిబ్బంది ఖండించారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితుడు మూర్తి సత్యనారాయణ శర్మ, ప్రధాన అర్చకుడు బలరాం శర్మ, ఉప ప్రధాన అర్చకుడు రవి కుమార్ శర్మ, సిబ్బంది భాను పాల్గొన్నారు.

సమోసాలో బల్లి!



మొయినాబాద్,జూలై 9(ఆంధ్రజ్యోతి): ఓ స్వీట్ షాపులో కొనుగోలు చేసిన సమోసాలో బల్లి కనిపించింది. దాంతో కష్టమర్ అవాక్కయ్యాడు. చేవెళ్ల మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మొయినాబాద్ మండల పరిధిలోని తోలుకట్ట స్టేజీ సమీపంలోని ఓ స్వీట్‌షాప్‌లో రెండు సమోసాలు కొనుగోలు చేసి తనతో పాటు వచ్చిన పాపకు ఒకటి ఇచ్చి తానూ ఒకటి తినేందుకు సిద్ధమయ్యారు. ఈక్రమంలో పాప వద్ద ఉన్న సమోసాలో బల్లి కనిపించింది. దాంతో వారు భయభ్రాంతులకు గురయ్యారు. పాప తండ్రి ఈ విషయమై షాపులో ఉన్న వ్యక్తిని అడిగితే.. నన్నేం చేయమంటావ్.. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోమంటూ నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం పాపను చేవెళ్ల ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆ పాప వాంతులు చేసుకున్నదని తెలిపారు. షాపు యజమానిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరాడు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



శంషాబాద్ : ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శంషాబాద్/చేవెళ్ల/చౌదరిగూడ, జూలై9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేసి 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు అన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో వివిధ రంగాలకు చెందిన కార్మికులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండు కూడలిలో బైఠాయించి కొద్దిసేపు నిరసన తెలిపారు. కార్మిక సంఘాల నాయకులు ఆర్.యాదగిరి అన్నెపు ప్రభు, నర్సింహరెడ్డి సక్రూ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం తక్షణమే ఆపాలని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కాడిగళ్ల భాస్కర్ డిమాండ్ చేశారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో సీపీఐ, సీపీఎం నాయకులతో పాటు వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల చట్టాలను కాలరాస్తున్నారని మండిపడ్డారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, ప్రభులింగం, సుధాకర్‌గౌడ్, మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, ఉపాధ్యక్షుడు మగ్బూల్, సీపీఎం డివిజన్ కార్యదర్శి దేవేందర్, జిల్లా కోశాధికారి లక్ష్మి, పాల్గొన్నారు. ప్రజా సమస్యలపై కార్మిక సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య అన్నారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రం నుంచి, కొందుర్గు మండల కేంద్రం వరకు సీపీఐ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఐ నాయకులు కృష్ణ, ఆకాశ్‌నాయక్, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.



చౌదరిగూడ : బైక్ ర్యాలీలో కార్మిక సంఘం నాయకులు

వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలివ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్‌ఏ జేఏసీ నాయకులు

వికారాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జీవో నంబర్లు 81, 85 ప్రకారం వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని వీఆర్‌ఏ జేఏసీ జిల్లా అధ్యక్షుడు పూజారి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం వీఆర్‌ఏ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వంగూరి రాములు పిలుపు మేరకు వీఆర్‌ఏ వారసులు, నాయకులు ర్యాలీ నిర్వహించి వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వీఆర్‌ఏలకు పే స్కేలు, వారసులకు ఉద్యోగ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పటికే 16,758 మందిని వివిధ శాఖల్లో సర్దుబాటు చేసినా మిగిలిన 3,797 మంది వారసుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.

రంగారెడ్డి కలెక్టరేట్ వద్ద...

రంగారెడ్డి అర్బన్ : జీవో నంబర్ 81, 85 ప్రకారం వీఆర్‌ఏ వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని, గ్రామ పరిపాలనా అధికారి(జీపీవో) నియామకాల్లో ప్రాధాన్యమివ్వాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏ వారసులు కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రయ్య, శ్రీనివాస్ యాదవ్, ప్రవీణ్, నవీన్ పాల్గొన్నారు.

రిసార్ట్స్ నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

వికారాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ది వైల్డర్ నెస్ రిసార్ట్స్‌లో ఇద్దరు మహిళా పర్యాటకులు మృతి చెందిన ఘటనపై రిసార్ట్ నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీ పండిట్, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నేత గీత డిమాండ్ చేశారు. బుధవారం వైల్డర్ నెస్ రిసార్ట్స్ పరిసరాలను సందర్శించారు. రిసార్ట్స్ నిర్వాహకులు ఎవరినీ లోపలికి రానివ్వక పోవడంతో వారి తీరుపై మండి పడ్డారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్ రెడ్డి, మల్లేశ్, మాదారం వెంకటేశ్, పీర్ మహమ్మద్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన సీనరేజీ ఫీజులు

(ఐదో పేజీ తరువాయి)

సీనరేజీ ఫీజులను సవరించారు. 2026 మార్చి 31వరకు సీనరేజీ చెల్లింపు ఉంటుంది. అయితే నాపరాయి, సుద్ద, ఎర్ర మట్టిపై సీనరేజీ ఫీజు పెంచకుండా ఊరట కల్పించారు. ఇసుక, కంకర పైన మరింత పెంచారు. కంకరపై 20శాతం మేర పెరిగింది.

ఫీజుల వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

స్టోన్, రఫ్ స్టోన్, మెటల్, బ్యాలిస్టు, ఇసుక రాయి, తయారు చేసిన ఇసుకకు రూ. 78, క్యూబిక్స్ కోసం ఉపయోగించే డైమెన్షనల్ స్టోన్‌కు రూ.156, మార్బుల్‌కు రూ. 156, మొజాయిక్ చిప్స్‌కు రూ.70, మొరం, కంకర రూ.26, గుల్కరాళ్లకు రూ.78, ఫ్లుర్స్‌ఎర్త్, బెంట నైట్‌కు రూ.195, సున్నపు రాయి స్లాబ్ రూ.130, మంగళూర్ టైల్స్‌కు రూ.9,360, సున్నపు ఇసుకకు రూ.116, సుద్ద రూ.125, బంక మట్టికి రూ.62, చైనా మట్టి రూ.94, డయస్పోంకు రూ.427, డొలమైట్‌కు రూ.156, డ్యూ నైట్‌కు రూ.62, ఇసుకకు రూ.94, జిప్సంకు రూ.109, లేట్‌రైట్‌కు రూ.140, సున్నపు రాయికి రూ. 148, ఫైల్ బంకమట్టికి రూ.78, బాల్ క్లేకు రూ.94, బ్లార్ గ్రానైట్ రూ.1,633 నుంచి రూ.4,680, రంగు గ్రానైట్‌కు రూ. 1,350 నుంచి రూ. 3,588గా తేల్చారు.

పేరుకే 'ప్రణాళిక!'

(ఐదో పేజీ తరువాయి)

వంటి కార్యక్రమాలు చేపట్టాలి. వీటితో పాటు వైద్య శిబిరాలు, డ్వాక్రా మహిళల ఉత్పత్తుల ప్రదర్శన, రుణాలిప్పించడం, పచ్చదనం-పరిశుభ్రతపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు వంటివి నిర్వహించాలి. కానీ అధికారులు వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాలేవీ సరిగ్గా చేపట్టడం లేదు. ఈ ప్రణాళికలో ప్రజలను, రాజకీయ నాయకులను భాగస్వామ్యం చేయాలి. మున్సిపల్ అధికారులు కార్యక్రమంపై కనీసం శ్రద్ధ చూపడం లేదు. ప్రణాళికలో పేర్కొన్న పనులు చేస్తే మురుగు కాలువలు శుభ్రమయ్యేవి. నిర్దేశించిన అంశాలను చేపడితే పట్టణ ప్రజల సమస్యలు కొంత మేరైనా పరిష్కారమయ్యేవి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్పీకర్ చొరవతో మర్పల్లి అభివృద్ధి

మర్పల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చొరవతో మర్పల్లి మండల అభివృద్ధికి కోట్లాది రూపాయలు మంజూరు అయ్యాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాములుయాదవ్ అన్నారు. బుధవారం స్థానికంగా మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఐటీఐ కళాశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతోపాటు డిగ్రీ కళాశాల ఏర్పాటుకు స్పీకర్ కృషి చేస్తున్నారని తెలిపారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాయొద్దు



తాండూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ



కొడంగల్‌లో మాట్లాడుతున్న నాయకులు



మేడ్చల్ టౌన్: నిరసన తెలుపుతున్న నాయకులు

ఊరూరా కార్మిక సంఘాల నిరసనలు, రాస్తారోకోలు

కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సమ్మె వికారాబాద్, మేడ్చల్ జిల్లాల వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రాలతో పాటు మండలాల్లో నాయకులు కార్మిక జెండాలు చేతబట్టి ర్యాలీలు తీశారు. కేంద్ర, రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. కార్మికుల హక్కులను కాలరాస్తే ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆయా చోట్ల నిర్వహించిన ర్యాలీల్లో కార్మిక సంఘాల నేతలు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, జూలై 9

సన్న బియ్యమైనా.. ససేమిరా!

(ఐదో పేజీ తరువాయి)

తీసుకోని కారణంగా పలు రేషన్ దుకాణాల్లో 2,098.810 మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు ఉండిపోయినట్లు తెలుస్తోంది.

కేవలం సంక్షేమ పథకాల కోసమే..

పేదలే కాకుండా రాజకీయ పలుకుబడితో, ముడుపులు ముట్టజెప్పి పలువురు రేషన్ కార్డులు పొందుతున్నారు. అయితే ప్రతీ నెలా జిల్లాలో 10 నుంచి 20 శాతం మంది బియ్యం తీసుకోకుండా ఉంటున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేసే ఏ సంక్షేమ కార్యక్రమమైనా, పథకమైనా వర్తించాలంటే రేషన్ కార్డును ప్రామాణికంగా పరిగణిస్తున్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి ఉచిత వైద్య సేవలకు రేషన్‌కార్డు అవసరం. దీంతో వీటి కోసమే కొందరు కార్డులు తీసుకుంటూ బియ్యం తీసుకోవడంలో ఆసక్తి కనబరచడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే, కొందరు మృతి చెందినా కూడా వారి కార్డులు తొలగించకుండా అలాగే ఉంచేసినట్లు తెలుస్తోంది. ఒంటరిగా ఉన్న వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న, మంచానికే పరిమితమైన వారు కూడా రేషన్ తీసుకోవడం లేదని చెబుతున్నారు. చేతి వేలి ముద్రలు పడని వారు బియ్యం పొందలేనట్లుగా తెలుస్తోంది. ఇదిలా ఉంటే, రేషన్‌కార్డు ఉన్న వారు ఎక్కడైనా రేషన్ తీసుకునే అవకాశం ఉండడంతో ఇతర ప్రాంతాల్లో బియ్యం తీసుకుని ఉంటారని అధికారులు అభిప్రాయ పడుతున్నారు. జీవనోపాధి కోసం హైదరాబాద్ వంటి మహానగరాలకు వలస వెళ్లిన రేషన్ కార్డుదారులు వారు నివాసం ఉండే చోట బియ్యం తీసుకుని ఉండవచ్చని వారు చెబుతున్నారు.



కీసరలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

ఘనంగా ఇందిరమ్మ మహిళా శక్తి సంబురాలు

ఇందిరమ్మ మహిళా శక్తి సంబురాల్లో భాగంగా బుధవారం మహిళా సంఘాల సభ్యులు సమావేశమయ్యారు. ఆయా గ్రామాలు, మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రతినిధులు మాట్లాడుతూ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ అన్ని రంగాల్లో దూసుకెళ్లాలని ఉత్సాహం నింపారు. ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఏ సంఘాల్లో లేని మహిళలను గుర్తించి వారిని కొత్త సంఘాల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పథకాలు, బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు స్వయం ఉపాధితో స్వావలంబన సాధించాలన్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, జూలై 9



ప్రెస్ క్లబ్‌ను ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, తదితరులు

శామీర్‌పేటలో ప్రెస్ క్లబ్ ప్రారంభం

శామీర్‌పేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మీడియాది కీలక పాత్ర అని శామిర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ అన్నారు. బుధవారం శామిర్‌పేట టౌన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధూకర్‌రెడ్డి, జీనోమ్ వ్యాలీ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, యూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాల్‌రాజ్, ఆర్టీఏ సభ్యుడు బీమిలి జైపాల్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో శామిర్‌పేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సరసం మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్‌గౌడ్ ఉన్నారు.

'బీఫ్ షాపులను తొలగించాలి'

వికారాబాద్, జూలై 9(ఆంధ్రజ్యోతి): శైలజా టాకీస్ వెళ్లే మార్గంలో బీఫ్ షాపులను తొలగించాలని పట్టణంలోని సుభాస్ నగర్ కాలనీవాసులు కోరారు. బుధవారం బీజేపీ నాయకులతో కలిసి వెళ్లి మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2003లో చికెన్, మటన్, చేపలు, బీఫ్ మాంసం విక్రయాలకు దుకాణ సముదాయం నిర్మించారని, అయితే ఆ సముదాయానికి బీఫ్ షాపుల యజమానులు వెళ్లడం లేదని, గతంలో ఇచ్చిన తాత్కాలికంగా దుకాణాలను సైతం ఖాళీ చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు శిరీష, నరోత్తంరెడ్డి, శ్రీధర్ రెడ్డి, అమర్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలి

పరిగి,జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఆర్డీవో వాసుచంద్ర సూచించారు. బుధవారం పరిగిలో జరిగిన బీఎల్‌వోల సమావేశంలో మాట్లాడారు. ఓటరు జాబితా సవరణపై బీఎల్‌వోలకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్లు నవీన్‌రెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

అతిపెద్ద విద్యార్థి సంఘం ఏబీవీపీ

వికారాబాద్/మోమిన్‌పేట్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే విద్యార్థుల కోసం జాతీయవాద పునాదులపై పనిచేస్తున్న అతిపెద్ద విద్యార్థి సంఘం ఏబీవీపీ అని సందీపని పత్రిక సహ సంపాదకుడు దేవేందర్ అన్నారు. బుధవారం ఏబీవీపీ 77వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ హరీష్ రావు, దయాకర్, సాయితేజ, తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్‌లో..

మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని బసవేశ్వర చౌక్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. 77వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యుడు అప్రమాది శ్రీకాంత్‌రెడ్డి, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో భారతమాత, స్వామి వివేకానంద చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. అనంతరం ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు.



ఆవిర్భావ వేడుకల్లో ఏబీవీపీ నాయకులు

విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలి

దోమ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంఈవో వెంకట్ ఆకాంక్షించారు. బుధవారం మండలంలోని దిర్సంపల్లి ప్రాథమిక పాఠశాలలో వంట గదిని ప్రారంభించారు. అనంతరం బ్రహ్మణపల్లి, జీబీ తండా, ఐలాబాద్ తండాలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు తదితర అంశాలను ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కేశవులు, వెంకట్‌రెడ్డి, కార్యదర్శి రాజేశ్, కొండారెడ్డి, మైపాల్‌రెడ్డి, పాఠశాల చైర్ పర్సన్ గిరిజ, మాజీ ఎంపీటీసీ సత్తయ్య, బందెయ్య, రాములు నాయక్, ఉపాధ్యాయులు సతీశ్, గోపాల్, బాలు, శేఖర్, నారాయణ, వెంకట్‌దాస్, పరిపూర్ణ, సీఆర్‌పీలు రఘుసింగ్, రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



వంట గదిని ప్రారంభిస్తున్న ఎంఈవో వెంకట్

విద్యా సేవ అభినందనీయం

మేడ్చల్ టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): నిర్సంహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం విద్యాప్రమాణాలను పెంచటానికి చేస్తున్న కృషి అభినందనీయమని కెరియర్స్ 360 అసోసియేట్ పబ్లిషర్స్ సంసథ సీఎస్‌వో శ్రీధర్ శర్మ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు కెరియర్ 360 సంస్థ ప్రతినిధులు బెస్ట్ పర్ఫార్మింగ్ అవార్డును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ శర్మ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో ఉత్తమంగా నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్ రెడ్డి, డైరెక్టర్ మోహన్, ప్రిన్సిపాల్ లోకనాథం, తదితరులు పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న కళాశాల నిర్వాహకులు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

దుద్యాల/బషీరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం మండలంలోని ఈర్లపల్లి గ్రామంలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సూర్యప్రకాశ్, కిషన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు హనీబాయి, నాయకులు రవినాయక్, మొగులయ్య, రాహుల్, రమేశ్, మహేశ్ పాల్గొన్నారు.

నిర్మాణాల్లో వేగం పెంచాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని బషీరాబాద్ ఎంపీడీవో విజయ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి హాజరుకాని క్యాద్గీరా గ్రామ కార్యదర్శి శృతి, నవాల్గ గ్రామ కార్యదర్శి వెంకటప్పకు మెమో జారీ చేసినట్లు తెలిపారు.



దుద్యాల: ప్రొసీడింగ్స్ అందిస్తున్న నాయకులు

సంక్షిప్తంగా..



నాణ్యమైన భోజనం అందించాలి

పరిగి, జూలై 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పరిగి ఎంఈవో గోపాల్ అన్నారు. బుధవారం పరిగి మండలం గడిసింగాపూర్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు అనంతరావు, జాంప్లా, సీఆర్‌పీ శ్రీశైలం ఉన్నారు.

కాంగ్రెస్ నూతన కమిటీ ఎన్నిక

కులకచర్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామ నూతన కాంగ్రెస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా నర్సింహులుయాదవ్, ఉపాధ్యక్షుడు కుమ్మరి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా రాకేశ్, గౌరవ అధ్యక్షుడిగా ఎల్లయ్య, సభ్యులుగా నర్సింహులు, మల్లయ్య, బుగ్గయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మోమిన్‌పేట్, జూలై 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటేశం పేర్కొన్నారు. మొరంగపల్లి, వెల్చాల్, దుర్గం చెరువు, ఎన్కెపల్లి, కేసారం, హిజ్రాచిట్టెంపల్లి, పల్లెగుట్ట తండా, బిక్యారెడ్డి బావులు, సయ్యద్ అలీపూర్ గ్రామాల్లో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పరిగి తహసీల్దార్‌గా వెంకటేశ్వరి

పరిగి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పరిగి తహసీల్దార్‌గా వెంకటేశ్వరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. భూవివాదంలో ఆరోపణలు ఎదుర్కొన్న తహసీల్దార్ ఆనంద్‌రావు బదిలీపై కలెక్టరేట్‌కు వెళ్లారు. అక్కడ పని చేస్తున్న వెంకటేశ్వరి బదిలీపై పరిగికి వచ్చారు. ఆమెకు ఆనంద్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌రెడ్డి, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు.

క్రైం కార్నర్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని..

ప్రియుడితో కలిసి తండ్రిని హతమార్చిన కూతురు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి తండ్రి అడ్డువస్తున్నాడని కన్న కూతురే తల్లి, ప్రియుడుతో కలిసి దారుణంగా హత్య చేసింది. బుధవారం ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌లో సీఐ పరశురాం వివరాలు వెల్లడించారు. నగరంలోని కవాడిగూడ, ముగ్గుబస్తీకి చెందిన వడ్లూరి లింగం(45) ఈ నెల 7న ఉదయం ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో శవమై తేలాడు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేశారు. మృతుడి భార్య వడ్లూరి శారద(40) జీహెచ్ఎంసీలో స్వీపర్‌గా పనిచేస్తుంది. కూతురు వడ్లూరి మనీషా(25)కు ఇద్దరు పిల్లలు. భర్త కంచర్ల రమేష్‌ను వదిలి ప్రియుడు మల్కాజ్‌గిరికి చెందిన మహ్మద్ జావేద్(24)తో కలిసి మౌలాలీలో ఉంటోంది. లింగం కల్లుకు బానిసై భార్య, కూతురిని నిందిస్తూ వేదింపులకు పాల్పడేవాడు. తండ్రి తన అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించి అడ్డుతొలగించుకోవాలని కూతురే తల్లి, ప్రియుడితో పతకం రచించింది. ఈ నెల 6న మధ్యాహ్నం శారద లింగంకు కల్లులో మత్తుమాత్రలు కలిపి తాగించింది. అయినా అతను లేచి తిరుగుతుండటంతో తల్లీ కూతుళ్లు వైన్‌షాప్‌కు వెళ్లి మద్యం తీసుకొచ్చారు. ప్రియుడు జావేద్‌తో కలిసి పూటుగా తాగించి హత్యచేసి మృతదేహాన్ని వేలాడదీశారు. తర్వాత కూతురు ఆమె ప్రియుడితో కలిసి సెకెండ్‌షో సినిమాకు వెళ్లారు. మధ్యరాత్రి తిరిగి వచ్చి క్యాబ్‌లో మృతదేహాన్ని ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు వద్దకు తరలించారు. జావేద్ మాత్రం బైక్(ఏపీ 09 ఏవై 1582) పై చేరుకున్నాడు. క్యాబ్ వెళ్లిపోగానే మృతదేహాన్ని చెరువులో పడేశారు. మరుసటిరోజు ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీనిపై పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టగా హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో ముగ్గురిని బుధవారం రిమాండ్‌కు తరలించారు.

గంజాయి విక్రయం.. ఇద్దరి రిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ సాయి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్‌కు చెందిన బ్లింక్ ఇట్ డెలివరీ బాయ్ బుర్ర గౌతమ్(23), ఘట్‌కేసర్, లింగాలకుంటకు చెందిన టైల్స్ వర్క్ చేసే కిరణ్‌కుమార్(29) ఘట్‌కేసర్ పెట్రోల్ బంకు సమీపంలో రాత్రి అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి వాళ్లను తనిఖీ చేయగా 330 గ్రాముల గంజాయి పట్టుపడింది. వారిని అదుపులోకి తీసుకొని గంజాయి, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని బుధవారం రిమాండ్‌కు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బొంరాస్‌పేట్, జూలై 9(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. బొంరాస్‌పేట్ మండలంలోని మహంతీపూర్ గ్రామానికి చెందిన పలువురు మూడు ట్రాక్టర్లలో ఇసుకను మంగళవారం రాత్రి మహంతీపూర్ వాగు నుంచి బురాన్‌పూర్ వైపు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఆనంద్‌గౌడ్ తెలిపారు.

విద్యార్థి అదృశ్యం



కులకచర్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్ల గిరిజన గురుకుల కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి సందీప్‌కుమార్ అదృశ్యమయ్యాడు. ఎంపీసీ చదవడం ఇష్టం లేకున్నా తల్లిదండ్రుల బలవంతం మేరకు కాలేజీలో చేరాడు. శనివారం పాలమూరు జిల్లా గండీడ్ మండలం రుసుంపల్లి గ్రామంలోని ఇంటికి వెళ్లి ఇష్టం లేదని తల్లిదండ్రులకు వివరించారు. వారు మందలించి సోమవారం కళాశాలకు పంపించారు. మంగళవారం ఉదయం కళాశాల గోడదూకి పరారయ్యాడు. విద్యార్థి గోడ దూకడం సీసీ కెమెరాలో నమోదైంది. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ మధుసూదన్ తల్లిదండ్రులకు తెలిపాడు. బుధవారం ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

చిచ్చు పెట్టిన వాట్సాప్ స్టేటస్

తాండూరు రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఓ వర్గాన్ని కించపరుస్తూ స్టేటస్ పెట్టావంటూ మరో వర్గానికి చెందిన కొందరు యువకుడిని చితకబాదారు. ఈ ఘటన తాండూరు మండలం అంతారం గ్రామంలో చోటు చేసుకుంది. అంతారం గ్రామానికి చెందిన ఓ యువకుడు మంగళవారం వాట్సాప్‌లో ఓ సామాజిక వర్గానికి కించపరుస్తూ స్టేటస్ పెట్టుకున్నాడు. ఈ స్టేటస్ చూసిన కొందరు తమ సామాజిక వర్గాన్ని కించపరుస్తావా అంటూ ఆ యుకుడిని చితకబాదారు. అంతటితో ఆగకుండా గ్రామంలోకి తీసుకెళ్లి క్షమాపణలు చెప్పించే ప్రయత్నం చేశారు. ఇదంతా కొందరు వీడియో తీస్తుండగా, అందులో మరో యువకుడిపై కూడా దాడి చేశారు. దీంతో బాధిత యువకుడు బుధవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ సంతోష్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



సందడిగా 'విలేజ్ థీమ్'

తాండూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తాండూరు మాజీ కౌన్సిలర్ బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి సాహు శ్రీలత బుధవారం స్నేహితులతో కలిసి విలేజ్ థీమ్ ఏర్పాటు చేశారు. పల్లెటూరి వాతావరణం ఎడ్ల బండి, పొలాలపై అవగాహన కల్పించారు. నూనె లేకుండా చేసిన తృణ ధాన్యాల వంటకాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



భక్తి శ్రద్ధలతో భగవద్గీత పారాయణం

వికారాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని గీతావాహిని ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. మొదటి రోజు గాంధీ కాలనీలో గీతావాహిని జిల్లా అధ్యక్షురాలు శ్రీదేశి సందానందం ఆధ్వర్యంలో నిర్వహించిన పారాయణంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ మంజులారమేశ్ హాజరయ్యారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

దోమ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండాల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులు, ఐడెంటీ కార్డులను పరిగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, సర్వేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకట్, కేశవులు, ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, సీఆర్‌పీ రఘుసింగ్ పాల్గొన్నారు.